# విపశ్యన మాసపత్రిక

VOLUME : 2 NO - 11 1 FEBRUARY, 2008

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు – 70

## "ధర్మవాణి"

*బాహుసచ్చఞ్చ సిప్పఞ్చ,*
*వినయో చ సుసిక్ఖితో ।*
*సు భాసితా చ యా వాచా,*
*ఏతం మజ్గలముత్తమం ॥*

*– ఖుద్దక పాఠ 5.5, మజ్గలసుత్త –*

**అనేక విద్యలను నేర్చుకొనుట, శిల్పకళలను నేర్చుకొనుట, వినయశీలుడై ఉండుట, సుశిక్షితుడై ఉండుట, సుభాషితుడై ఉండుట, ఇదే ఉత్తమము, మంగళకరము.**

(గత సంచిక తరువాయి)

## బుద్ధుని బోధనల యొక్క సార్వత్రిక లక్షణం - వ్యక్తిగత అనుభవము - 2

### సత్యనారాయణ గోయంకా

(మియన్మార్‌లోని యాంగూన్ (పూర్వపు రంగూన్) పట్టణంలో నాలుగవ ప్రపంచ బుద్ధానుయాయుల శిఖరాగ్రసభలో 10-2-2004న పూజ్య గురూజీ శ్రీ గోయెంకా గారిచే ఇవ్వబడిన ముగింపు ప్రసంగము.)

ఎవరైనా తమ మనసును ఉపరితలం వరకు శుభ్రం చేయగలరు. ఇంకా కొంచెం లోతువరకు కూడా శుభ్రం చేయగలరు. కాని మనసును అట్టడుగు లోతువరకు, మూలాల వరకు శుభ్రం చేసే మార్గం లుప్తమైపోయి ఉండింది. అనుశయ క్లేశములను (నిద్రాణముగా ఉన్న మనోవికారములను) నిర్మూలించడం ఎలాగో బుద్ధుడు కనుగొన్నాడు. ఈ వికారాల మూలాలను పెకిలించి వేయాలి. ప్రతీత్యసముత్పాదము ***(పటిచ్చసముప్పాద) :*** (హేతువు అనగా కారణము వలన ఉత్పత్తన్నమగుట)లో వివరించబడినట్లుగా ఈ అనుశయక్లేశములు ఉన్నంతవరకు రాగము (తృష్ణ), దానికే అతుకుకొని ఉండటం (ఉపాదానము - ఆసక్తి)లతో కూడిన భవచక్రములు అనుసరించే ఉంటాయి; దుఃఖచక్రములోనే తిరుగుతూ ఉంటాము; జననమరణ దుఃఖముల నుండి బయటపడలేము. చాలా ఉన్నతమైన దేవలోకములోనో, బ్రహ్మలోకములలోనో జన్మిస్తు ఉండవచ్చు. అయినప్పటికి అటువంటి వారు జనన మరణ క్షేత్రంలోనే ఉంటారు. దుఃఖక్షేత్రంలోనే ఉంటారు.

అనుశయక్లేశములే భవచక్రానికి బీజములు. అవి జన్మ తరువాత జన్మను కలిగిస్తూనే ఉంటాయి. అనుశయక్లేశాలు నిర్మూలించబడనంత వరకు దుఃఖం నుండి ఎవరూ బయటపడలేరు.

బుద్ధుడు చెప్పాడు – "శీల, సమాధి, ప్రజ్ఞ"లతో కూడిన ధర్మము పరిపూర్ణమైనది; దానికి ఏమియు కలుపనక్కరలేదు; పూర్తి ధర్మమంతయు దానిలోనే ఉంది. దానిలో కొరవడినది ఏమియు లేదు. శీల సమాధి ప్రజ్ఞలలో కొరవడినది ఏమీ లేదు. ధర్మము పరిశుద్ధమైనది; ఎంత పరిశుద్ధమైనదంటే దానినుండి ఏమియు తీసివేయవలసినది లేదు; ఏమియు కలుపనక్కరలేదు. అది సంపూర్ణమైనది; పరిశుద్ధమైనది – ***"కేవలం పరిపున్నం, కేవలం పరిసుద్ధం".***

ఈనాడు బుద్ధుడు బోధించిన ఈ విపశ్యన ధ్యానప్రక్రియ ప్రపంచమంతయు వ్యాపించడం మనం చూస్తున్నాము. మేధావులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, డాక్టర్లు, మానసిక వైద్యులు అందరూ దీనిని నేర్చుకొని లాభపడుతున్నారు. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, యూదులు, జైనులు, పార్సీలు, సిక్ఖులు, బౌద్ధుల లాంటి అన్ని వర్గాల ప్రజలు ఈ శిబిరాలకు వస్తున్నారు. సాంప్రదాయానుసారం బుద్ధుని వ్యతిరేకించే వర్గాలకు చెందిన ప్రజలు కూడా విపశ్యన శిబిరాలకు వచ్చి, అది తమకు ఆమోదయోగ్యంగానే ఉండటం గమనిస్తున్నారు.

ఇదే బుద్ధుని బోధనలలోని చక్కదనము. ఇది సరళము, ఆచరణ యోగ్యము, సార్వజనీనము. అందరికీ ఆమోదయోగ్యము అయినది. కేవలం శీల సమాధి ప్రజ్ఞలను ఆచరించడమే. ఇంతే. శీలము, సమాధి, మరియు ప్రజ్ఞ–వీటి ఆచరణను తప్పు అని ఎవరూ అనలేరు కదా! బుద్ధుని బోధనలోని సారాంశమైన శీల, సమాధి, ప్రజ్ఞలు అందరికీ ఆమోదయోగ్యమైనవి. ఎందుకంటే అన్ని మతముల లక్ష్యము మనోపరిశుభ్రతే. బాహ్యంగా అన్ని మతాలు వివిధములైన రూపురేఖలు, పండుగులు, కర్మకాండలతో ముడిపడి ఉన్నవి. అంతరసారానికి ప్రాముఖ్యత ఇస్తున్నంతవరకు, మతానికి మతానికి బాహ్యరూపాలలో తేడాలు ఉన్నప్పటికి ఫరవాలేదు. కాని ప్రాధాన్యత అంతా బాహ్యరూపానికి మాత్రమే ఇచ్చినప్పుడు అంతరసారాన్ని కోల్పోతాము. అప్పుడు మతం సుఖశాంతులను ప్రసాదించలేదు. బుద్ధుని బోధన అంతరసారానికి అనుగుణంగా జీవించడానికి సహాయపడుతుంది. అది ఇప్పుడే, ఇక్కడే ఫలితాలను ఇస్తుంది.

విపశ్యన అభ్యాసం వలన నేనెంత మేలు పొందానంటే, నా ఆచార్యుని సలహామేరకు బుద్ధవాణిని చదవడం మొదలు పెట్టాను. బుద్ధుడు తన బోధనలలో హిందూసాంప్రదాయంలోని మంచి విషయాలను తీసుకొని, దానికి భ్రమలను జోడించాడని, అతడు కొత్తగా కనుగొన్నది ఏమీ లేదని నా బాల్యము నుండి నేను వింటూనే ఉన్నాను. బుద్ధుని బోధన నాకు మేలు చేసినందువలన వీటిలోని సత్యము గురించి మరింత అన్వేషించాను. బుద్ధవాణిని (త్రిపిటకములు) చదవడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. సత్యము యొక్క వాస్తవ అనుభవం గురించే బుద్ధుడు నొక్కి చెప్పిన విషయం నాకు అర్థం అయ్యింది. నేను అంతకు ముందు విన్నది అంతా తప్పని తేలింది. త్రిపిటకములు చాలా స్ఫూర్తినిస్తాయి. బుద్ధుని ధర్మకాయం యొక్క అద్భుత వివరణ దానిలో ఉంది.

**బుద్ధుడు ప్రజలకు ధర్మాన్ని నేర్పేటప్పుడు ఇలా చెప్పేవాడు : "మిమ్మల్ని నా శిష్యులుగా చేసుకోవడంలో నాకు ఆసక్తి లేదు. మిమ్మల్ని మీ పాత గురువులనుండి నావైపుకు తిప్పుకోవడంలోను నాకు ఆసక్తి లేదు. దుఃఖము నుండి బయటపడే మార్గాన్ని నేను తెలుసుకొన్నాను. దానిని ఒకసారి ప్రయత్నించి చూడండి".**

ధర్మం గురించి సంశయంతో ఉన్న సన్యాసులతో ఒకసారి మాట్లాడుతున్నప్పుడు బుద్ధుడు వారిని ఒకవారమే ప్రయత్నించి చూడమని కోరాడు.

ప్రపంచంలోని ప్రజలు అధికాధికంగా తమనుతాము బౌద్ధులమని పిలిపించుకొనుట మొదలుపెడితే ఏమి లాభము పొందగలరు? వారు గనుక శీల, సమాధి, ప్రజ్ఞలను అభ్యసించుట మొదలుపెడితే వారు బుద్ధుని బోధనల యొక్క ఉత్తమ ఫలాలను తప్పనిసరిగా పొందుతారు. తనను తాను బౌద్ధునిగా, బుద్ధానుయాయిగా పిలిపించుకునే వ్యక్తి శీల, సమాధి, ప్రజ్ఞలను ఆచరించకపోతే బుద్ధుని బోధనలనుండి ఏవిధంగా లాభం పొందగలడు?

బుద్ధునికి తన యొక్క శిష్యుల పేర్లు మార్చడంలో ఆసక్తి లేదు. మొగ్గల్లాన మొగ్గల్లాన గానే ఉన్నాడు; కచ్చాన (కాత్యాయన) కచ్చానగానే ఉన్నాడు. భారద్వాజ భారద్వాజ గానే ఉన్నాడు. ఇవి బ్రాహ్మణుల పేర్లు, బ్రాహ్మణ కులస్తుల పేర్లు.

బుద్ధుని బోధన చాలా సరళము. అయిననూ చాలా గంభీరము. ధర్మాన్ని ఆచరించుటకు చాలా కష్టపడవలసి ఉంటుంది. నా గురుదేవులు అంటుండేవారు. "ఇది చాలా సులువు, అయినప్పటికి చాలా కష్టం".

ధర్మం గురించి వినడం, చదవడం చాలా లాభదాయకం. – ***"కాలేన ధమ్మసాకచ్ఛ, ఏతం మఙ్గలముత్తమం."*** సమయోచితంగా ధర్మచర్చ చేయడం ఉత్తమమైన మంగళం. కాని కేవలం చర్చలు, వాదోపవాదాలు చేస్తూ, ధర్మాన్ని ఆచరించకపోతే ఉపయోగం లేదు. ధర్మమార్గంలో పయనించడం మొదలుపెట్టాలి. ధర్మమార్గంలో నడవకపోతే ఏమి లాభం లేదు.

బుద్ధుడు బోధించిన ధర్మం అందరికీ వర్తించే ప్రకృతి నియమమే. ఆయన ఎంతో సరళమైన భాషలో స్పష్టంగా బోధించాడు. దానిని మనం ఆచరించకపోతే, దానినుండి ఒక తత్వశాస్త్రాన్ని తయారుచేసి, పోట్లాట మొదలుపెడతాము. "నీ నమ్మకం తప్పు. నా నమ్మకమే సరైనది. నీ నమ్మకం తప్పు, నా నమ్మకం సరైనది". మనకేమి లాభం? నా నమ్మకం సరైనదయినప్పటికి, చాలా మంచిదైనప్పటికి, నేను దానిని ఆచరించకపోతే ఆ నమ్మకం వల్ల ఏమి లాభం?

నేను మియన్మార్ (బర్మా)లో పుట్టాను. నేను ఈ ధర్మభూమిలో పుట్టినందుకు కృతజ్ఞుడను, గర్వపడతాను. ఇక్కడ ప్రజలలో 80శాతం కన్నా ఎక్కువమంది తమ లోపల ఒక ఆత్మ ఉందని నమ్మరు. ఈ విశ్వానికి సృష్టికర్తగా సర్వశక్తి సంపన్నుడైన దేవుడు ఒకడున్నాడని కూడా వారు నమ్మరు. గడిచిన మూడు దశాబ్దాలుగా నేను నివసిస్తున్న భారతదేశంలోను, నేను తరచూ ప్రయాణించే ఇతర దేశాలలోనూ 80 శాతానికి పైగా ప్రజలు తమ లోపల ఒక ఆత్మ ఉందని నమ్ముతారు. సర్వశక్తిసంపన్నుడైన దేవుడే ఈ విశ్వాన్ని సృష్టించాడని కూడా వారు నమ్ముతారు.

ఆత్మ ఉందని నిరూపించడానికి గానీ, లేదని నిరూపించడానికి గానీ వేలకొలది వాదనలు ఉండవచ్చు. అలాగే దేవుడు ఉన్నాడనీ, లేడనీ ఎన్నో వాదనలు ఉండవచ్చు. ఈ వాదనలన్నీ నిరర్థకమైనవే. పనికిరానివే.

ధర్మాన్ని ఆచరిస్తే, జరిగే ఘటన అంతా కూడా శరీరము మనసుల మధ్య చర్య తప్ప మరేమీ కాదనే విషయం అనుభవానికి వస్తుంది. పైకి కనిపించే స్థాయిలో ఇదంతా చాలా ఘనీభూతంగానూ, స్థిరమైనదిగాను, నిత్యమైనదిగాను కనిపిస్తుంది. ఇది ***"పఞ్ఞత్తి"*** – అలా కనిపిస్తుంది. బుద్ధుని బోధన స్థూలసత్యము ***"పఞ్ఞత్తి"*** నుండి అంతిమ సత్యమునకు ***(పరమత్థ)*** జరిగే ప్రయాణమే. అంతిమ సత్యమునకు చేరాలంటే స్థూలసత్యమును దాటి వెళ్ళవలసిందే. ఇదే విపశ్యన అంటే – ***"పఞ్ఞత్తి ఠపేత్వ విసేసేన పస్సతీ'తి విపస్సనా"*** – తన లోపల తను చూసుకుంటున్నట్లైతే, మనసు, పదార్థముల క్షేత్రంలోనిదంతయు కూడా అనిత్యమైనదే అని గ్రహించడం మొదలు పెడతాడు. దేహ చిత్తముల స్థాయిలో ప్రతీదీ మార్పు చెందుతూనే ఉంటుందని తెలుసుకొంటాడు.

మారుతూ ఉండేది ఏదీ కూడా శాశ్వతమైన ఆనందానికి ఆధారం కాజాలదు. ఇప్పుడు అనుభవించే ఆనందం ముందో వెనుకో దుఃఖంగా మారుతుందని గ్రహిస్తాము. మార్పుచెందే ఆనందంలో దుఃఖం అంతర్లీనమై ఉంది. ఈ మార్గంలో ముందుకెళ్ళేకొద్దీ, మనసు – పదార్థము (దేహము)లోని ప్రతి అనుభవంలోను దుఃఖం స్వతస్సిద్ధమని తెలుసుకొంటాము – ***"యం కిఞ్చి వేదయితం తం దుక్ఖస్మిం".***

బుద్ధుడు బోధించిన విధంగా విషయమును తటస్థంగా గమనించినట్లయితే, ఘనత్వమనేది లేదని తెలుసుకుంటాము. మనసు – పదార్థముల విషయాన్ని పరిశోధించినట్లయితే, ప్రతీదీ కేవలం ప్రకంపన మాత్రమే అని తెలుసుకొంటాము. ***"సబ్బోలోకో పజ్జలితో, సబ్బోలోకో పకమ్పితో".*** ఈ విశ్వమంతా ప్రజ్వలనం మరియు ప్రకంపనము తప్ప మరేమీ కాదు. ఇందులో శాశ్వత పదార్థమేమీ లేదు. దీనిపై ఎవరికి అదుపు లేదు. "నేను" లేక "నాది" లేక "నాఆత్మ" అని చూపుటకు ఏదీ లేదు.

అనిత్య యొక్క అనుభవపూర్వకమైన అనుభూతి "సంజ్ఞ"ను "అనిత్యసంజ్ఞ"గా మారుస్తుంది. ఇది సహజంగా "అనాత్మ" బోధకు దారితీస్తుంది. ఇది నిర్వాణం యొక్క అనుభూతికి దారితీస్తుంది :-

***"అనిచ్చసఞ్ఞినో హి, అనత్తసఞ్ఞా సన్ఠాతి, అనత్తసఞ్ఞీ***

***అస్మిమానసముగ్ఘాతం పాపునాతి దిట్ఠేవ ధమ్మే నిబ్బాన'న్తి" ॥***

ఇది అనుభవంలోకి రావాలి. ఆత్మ లేదు అని చెబుతూ ఉండవచ్చు కాని పూర్తిగా అహంతో ఉన్నప్పుడు బుద్ధుని బోధనలు సహాయపడవు. అహం చాలా బలంగా ఉంటుంది. అనాత్మను అనుభవించకుండా దానిని ఒక తత్వశాస్త్రం క్రింద మారిస్తే ఏమీ ఉపయోగం లేదు. ఇది స్వానుభవానికి రావాలి. అప్పుడే ముక్తులౌతారు. అది అనాత్మ.

అనుభవపూర్వక అవగాహన వల్ల, "ప్రజ్ఞ" అహాన్ని కరిగించే దశకు సహజంగా తీసుకొని వెళుతుంది. ఇది మేధోక్రీడగాని, భావావేశపూరిత క్రీడగానీ లేదా భక్తికి సంబంధించిన ఆటగాని కాదు. ఇది గుడ్డి నమ్మకం కాదు. ఇది ఒక మూఢ నమ్మకం కాదు, ఇది ఒక మతవిధానం కాదు, ఇది ఒక తత్వశాస్త్రం కాదు, ఇది ప్రతిఒక్కరు తెలుసుకోగలిగిన సత్యము:- ఒక క్రిష్టియన్, ఒక ముస్లిం, ఒక హిందువు, ఒక జైనుడు, ఒక బర్మావాసి, ఒక థాయిలాండ్‌వాసి, ఒక భారతీయుడు, ఒక పాకిస్తానీయుడు, ఒక అమెరికన్, ఒక రష్యన్ లేక చైనావాడు ఎవరైన సరే, తేడా ఏమీ లేదు. ప్రకృతి నియమం సార్వత్రికము. ఇది అందరికీ వర్తిస్తుంది. బుద్ధుడు కనుగొన్నది ఇదే. గతంలో కొంతమంది దీనిని అంగీకరించారు, కొంతమంది అంగీకరించలేదు. బుద్ధుడు మార్గం చూపుతాడు. నిన్ను గుడ్డిగా నమ్మమని ఆయన అనలేదు. నీ అంతట నీవు సత్యాన్ని తెలుసుకొనుటకై ఆయన నీకు మార్గాన్ని చూపాడు.

భూమి గుండ్రంగా ఉన్నదని గెలీలియో అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. భూమి దాని అక్షం పై అది తిరుగుతుందని కూడా ఆయన కనుగొన్నాడు. కొంతమంది దానిని నమ్మారు, కొందరు దానిని నమ్మలేదు. తరువాత ప్రజలందరూ దానిని సత్యమని అంగీకరించారు. గెలీలియో కంటే ముందుకూడా భూమి గుండ్రంగానే ఉంది. గెలీలియో తరువాత కూడా భూమి గుండ్రంగానే ఉంటుంది. భూమ్యాకర్షణ సూత్రాన్ని న్యూటన్ కనుగొన్నాడు. ఆయన దానిని ప్రకటించాడు. న్యూటన్ కంటే ముందుకూడా భూమ్యాకర్షణ వుంది. న్యూటన్ కాలంలో ఉంది, న్యూటన్ తరువాత కూడా ఉంటుంది.

అదేవిధంగా బుద్ధుని కంటే ముందు, బుద్ధుని కాలంలో, మరియు బుద్ధుని తరువాత కూడా "ప్రతీత్యసముత్పాదము" ***(పటిచ్చ సముప్పాద)*** అనే ధర్మనియమం ఉంటుంది. ఇది ప్రకృతి నియమము. బుద్ధుడు ఉన్నప్పటికి లేనప్పటికి ***"ధమ్మనియామతా"*** (ధర్మనియమము) శాశ్వతంగా ఉంటుంది. బుద్ధుడు ఈ విధంగా తెలిపాడు :- ***"ఉప్పాదా వా తథాగతానం అనుప్పాదా వా తథాగతానం, ఠితావా సా ధాతు ధమ్మట్ఠితతా ధమ్మనియామతా ఇదప్పచ్చయతా".***

అజ్ఞానం (అవిద్య) వలన మనసు - పదార్థముల (శరీర చిత్తముల) క్షేత్రంలో ఏమి జరుగుతుందో తెలుసుకోలేము. ప్రతిక్షణం శరీరమంతా ఏదో ఒక సంవేదన ఉంటూనే ఉంది. జీవమున్న ప్రతిచోట సంవేదన ఉంటుంది. ఈ ఆరు జ్ఞానేంద్రియములు వాటి సంబంధిత విషయాలను తాకినప్పుడు సంవేదన ఉంటుంది. ***"ఫస్స పచ్చయా వేదనా".*** సంవేదనను తెలుసుకొనే సామర్థ్యం లేకపోతే దాని ఆధారంగా రాగద్వేషాలు ఎలా తెలుసుకోగలరు? ***"వేదనా పచ్చయా తణ్హా"***

***"వేదనా పచ్చయా తణ్హా"*** అనేది బుద్ధునికి ముందూ బుద్ధుని కాలంలోను, బుద్ధుని తరువాతకూడా ఉంది. ఈ ధర్మం శాశ్వతమైనది ***-"ఏస ధమ్మో సనన్తనో".***

బుద్ధుడు దీనిని కనుగొని, తన ముక్తి సాధించుకొని, అపారమైన దయతో ఇతరులకు పంచాడు. "చూడండి, మీరు ఈ విధంగా దుఃఖములో ఉన్నారు. ***"వేదనా పచ్చయా తణ్హా, వేదనా పచ్చయా తణ్హా'***'. దానినుండి బయటకు వచ్చే మార్గమును నేను బోధిస్తాను. ఇప్పుడు ***"వేదనా"*** (సంవేదన) ఉంది, కాని ***"తణ్హా"*** (తృష్ణ) లేదు. ***"వేదనా"***ను అనుభవించిన ప్రతిసారి ***"పఞ్ఞా"*** (ప్రజ్ఞ) తప్పనిసరిగా ఉదయించాలి. ***"అనిచ్చ", 'అనిచ్చ"*** (అనిత్య, అనిత్య). ఈ సంవేదన అయినా, ఆ సంవేదన అయినా అనిత్యమే.

"ప్రతి సంవేదన అనిత్యమైనదే" అనేది కనుక ఒక తత్వశాస్త్రంగా మారితే ఏమి ఉపయోగం లేదు - అది ఒక నమ్మకం మాత్రమే. కాని ఇలా అనుభవానికి రావాలి : "చూడు, ఒక సంవేదన పుట్టింది. ముందో వెనకో అది పోతుంది. సంవేదన ఎంత దుఃఖకరమైనదైనా, అది సమాప్తం అయి తీరవలసిందే. సంవేదన ఎంత సుఖకరమైనదైనా, అది సమాప్తం అయితీరవలసిందే".

ఈ పుట్టటము మరియు నశించిపోవడం యొక్క ఎరుక కలిగియుండాలి - ***"సముదయ-ధమ్మానుపస్సీ విహరతి, వయధమ్మానుపస్సీ విహరతి".*** సంవేదన కొంచెంసేపు ఉన్నట్లు కనిపిస్తుంది కాని ముందో వెనుకో నశించిపోతుంది. కాని ప్రతిక్షణం ఎటువంటి అంతరాయం లేకుండా అది పుడుతుంది, గిడుతుంది అని సాధకుడు తన స్వానుభవంతో తెలుసుకొంటాడు. చాలా వేగంతో అది పుట్టడంతోటే గిడుతుంటుంది :- ***"సముదయ వయ ధమ్మానుపస్సీ విహరతి".***

ఏదో ఒక సంవేదన ఎల్లప్పుడు ఉండనే ఉంటుంది. అది పుడుతుంది నశిస్తుంది. మనం దానికి ప్రతిక్రియ చేస్తుంటాము. సుఖకర సంవేదన అయితే రాగంతో ప్రతిక్రియ చేస్తుంటాము. దుఃఖకరమైనది అయితే ద్వేషంతో ప్రతిక్రియ చేస్తుంటాము. జీవితమంతా ఇలానే చేస్తూ, దుఃఖాన్ని మరింతగా కలిగించుకొంటాము. దుఃఖాన్ని మరెన్నో రెట్లు పెంపొందించుకొంటూపోతాము. దుఃఖము నుండి బయటపడే మార్గమున్నది. సంవేదన ఆగిపోతే, రాగద్వేషాలు ఆగిపోతాయి. రాగద్వేషాలు ఆగిపోతే, బంధనాలు (తృష్ణ) ఆగిపోతాయి :- ***"వేదనా - నిరోధా, తణ్హా -నిరోధో, తణ్హా నిరోధా, ఉపాదాన నిరోధా".*** మనసు - శరీరముల క్షేత్రమును దాటివెళ్ళే దశ వస్తుంది.

బుద్ధుడు కేవలం ధర్మోపదేశాలే చేయలేదు. కేవలం ధర్మోపదేశాలే అయితే, అవి అతనిని ప్రపంచములోని అనేక తత్వవేత్తలలో ఒకనిగా చేసేవి. ఆయన అంతిమ సత్యమును అనుభవానికి తెచ్చుకొని బుద్ధుడయ్యాడు. ఇతరులకు దానిని అనుభవంలోకి తెచ్చుకోవడం ఎలాగో నేర్పించాడు.

దాని యొక్క ఆచరణీయ రూపం వలన బుద్ధుని బోధన నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఇది కేవలం బుద్ధివిలాసమే అయితే బుద్ధుడు బోధించిన మార్గం లోనికి నేను వెళ్ళి ఉండేవాడిని కానేమో. నేను ఇలా అని ఉండేవాడిని "చాలా మంచిది, మా భగవద్గీత కూడా ఇలాగే చెపుతుంది. మా ఉపనిషత్తులు కూడా ఇలా చెపుతున్నాయి. ఇది చాలా అద్భుతం". కాని ఈ మార్గంపై నడిచి ఉండేవాడిని కాదు. "చూడు. నీవు ఈ విధంగా రాగద్వేషాల నుండి బయటపడగలవు" అని నాకు మార్గం చూపించబడినందున నేను ఒప్పుకొని స్వీకరించాను.

అద్భుతమైన ధర్మభూమిలో పుట్టటం నేను చాలా అదృష్టంగా భావిస్తాను. ఎక్కడైతే బుద్ధుని బోధన తన మౌలిక శుద్ధరూపంలో భద్రపరచబడిందో, ఆ దేశంలో పుట్టడం నా గొప్ప అదృష్టం. విపశ్యన ఆచరించవలసిన విధానం ఇక్కడ కొనసాగించబడుతున్నది. ప్రతిఫలాపేక్ష లేకుండా ఎంతో దయతో నాకు బోధించిన సాధుసదాచారిని కలుసుకోవడం నా అదృష్టం.

బుద్ధుని జీవితంలో మియన్మార్ (బర్మా)కు ఒక ప్రత్యేక స్థానముంది. బుద్ధత్వం పొందిన తరువాత, బుద్ధత్వపు పరమానందమును ఏడు వారాలు అనుభవించిన తరువాత ఆయన తీసుకొన్న మొదటి భోజనం మియన్మార్ వరి అన్నం మరియు తేనె. ఇది "తపస్సు" మరియు "భల్లిక' ' అను ఇద్దరు మియన్మార్ వ్యాపారస్థులచే ఆయనకు ఇవ్వబడింది. బుద్ధుని యందు, ధర్మము నందు శరణు తీసుకోవడం ద్వారా వారు మొట్టమొదటి గృహస్థ అనుయాయులు (ఉపాసకులు) అయ్యారు. ***(ద్వేవాచిక ఉపాసక).*** ఇది మొట్టమొదటి "ద్విశరణగమన". (బుద్ధుని యందు, ధర్మమునందు శరణు). బుద్ధుడు తన తలవెంట్రుకలు కొన్నింటిని ***(కేసధాతు)*** ఆ యిద్దరు వ్యాపారస్థులకు ఇచ్చాడు.

అతని జీవితకాలంలో ఇచ్చిన ధాతువు, ఆయనచే వ్యక్తిగతంగా బహూకరించబడినది, అదికూడ ఆయన జీవితకాలంలో ఒకేఒకసారి అటువంటి బహుమతి ఇవ్వడం – నిజంగా చాలా ప్రత్యేకమైనది. ఆయన జీవితకాలంలో బహూకరించబడిన ఈ బుద్ధధాతువు మియన్మార్ చేరినది. స్వెడగాన్ పగోడ ఈ వాస్తవానికి ఒక సుప్రసిద్ధ నివాళి. మియన్మార్ బుద్ధుని యొక్క కేశధాతువు కన్నా ఎక్కువే భద్రపరిచింది. ఇంత దీర్ఘకాలంగా అది సద్ధర్మము – ***"పరియత్తి"*** (సిద్ధాంతం) మరియు ***"పతిపత్తి"*** (ఆచరణ) లను ముఖ్యంగా "విపశ్యన" అభ్యాసాన్ని భద్రపరిచింది.

ఈనాడు విపశ్యన ప్రపంచమంతా వ్యాపిస్తున్నది. మియన్మార్, భారతదేశము, ఇతర బుద్ధానుయాయ దేశములు, ప్రపంచములోని ఏ ఇతర ప్రాంతాలకు చెందినవారెవరైనా – అతిముఖ్యమైన విషయమేమిటంటే ధర్మమార్గంలో నిజంగా నడవడం.

శుద్ధధర్మమును అనుభవస్థాయిలో ఆస్వాదించే అవకాశం మీ అందరికి లభించుగాక!

మీరందరూ మీ దుఃఖముల నుండి బయటపడుదురుగాక! మీరందరూ నిజమైన శాంతిని, నిజమైన సామరస్యమును, నిజమైన ఆనందమును పొందుదురుగాక!

***భవతు సబ్బ మఙ్గలం – భవతు సబ్బ మఙ్గలం –***
***భవతు సబ్బ మఙ్గలం***

జీవులన్నీ ఆనందముగా – సుఖంగా ఉండునుగాక!

(విపశ్యనా ఆంగ్ల పత్రిక 25 జనవరి 2005 నుండి అనువదించబడిన పూజ్యగురూజీ ప్రసంగం)

(సమాప్తం)

**సంవత్సర చందా రూ. 50/- ,  5 సంవత్సరముల చందా రూ. 200/-  ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**
**విపశ్యన తెలుగు మాసపత్రిక,**
**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070. ఫోన్ : 24240290 (ఆశ్రమం).**
***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

Postal Reg. HSE 864/2007-2009 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

TO

If Undelivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6 KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam.
Editor : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979.